సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 17 । ఆగస్టు । 2025

ఇస్కాన్‌లో పుష్ప అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు





జిల్లా పరిషత్ జంక్షన్‌లోని శ్రీకృష్ణ మందిర్‌లో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

ఇల బృందావనం











ఎంవీపీకాలనీలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో రాధాకృష్ణులకు పుష్పాభిషేకం



గంభీరంలోని హరేకృష్ణ వైకుంఠంలో పవిత్ర జలాలతో శ్రీరాధా మదన్‌మోహనులకు జలాభిషేకం

ధర్మ సంస్థాపనార్థం ద్వాపరయుగంలో అవతరించిన శ్రీకృష్ణ పరమాత్ముడు.. కలియుగంలో చిన్నారుల రూపంలో భూవికి దిగివచ్చాడా అన్నట్లు నగరంలో కృష్ణాష్టమి వేడుకలు కనులపండువగా జరిగాయి. జిల్లా పరిషత్ సమీపంలోని కృష్ణ చైతన్య మఠం, హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్, గంభీరం ఐఐఎం రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం, సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో జరిగిన వేడుకలు ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లాయి.108 పవిత్ర జల కలశాలతో, ఫలరసాలు, పంచగవ్యాలు, సుగంధ పుష్పాలతో స్వామికి జరిగిన మహోన్నత మహాభిషేకం భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తింది. నగరమంతా హరే కృష్ణ నామస్మరణతో మార్మోగి.. భక్తి సాగరంలో ఓలలాడింది.

8లో

ఎక్సైజ్ శాఖలో అప్పల అప్పారావు!

మద్యం దుకాణదారుల వద్ద రూ.లక్షల్లో వసూళ్లు

- సెలవులో పంపిన ఉన్నతాధికారులు
- అప్పులు అడగకుండా ఎత్తుగడలు
- చినబాబు అండ ఉందంటూ పరోక్ష బెదిరింపులు
- తిరిగి ఇక్కడికే వస్తానంటూ హెచ్చరికలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

అప్పుల అప్పారావు... ఇది సినిమా పేరు కాదు. విశాఖలోని ఎక్సైజ్ సీఐకు ఉన్న మరో మారుపేరు. గతంలోనే అనేక ఆరోపణలతో జైలుకు కూడా వెళ్లి వచ్చిన సీఐ తన అసలు బుద్ధిని మాత్రం మార్చుకోలేదు. పైగా కీలకమైన శివారు ప్రాంతంలో పోస్టింగును పై నుంచి ఒత్తిడి తెచ్చి మరీ దక్కించుకున్న ఆయన యథావిధిగా వసూళ్లకు దిగారు. తనకు అవసరాలు ఉన్నాయి.. అప్పు ఇవ్వాలంటూ తెలిసిన అన్ని మద్యం షాపుల యాజమానులతో పాటు బార్ల యజమానుల నుంచి భారీగా వసూలు చేసినట్టు తెలుస్తోంది. రూ.లక్షల్లో ఇలా వసూలు చేసిన నేపథ్యంలో సెలవులో వెళ్లాలంటూ ఉన్నతాధికారులు ఆదేశించారు. తద్వారా గత నెల రోజులుగా కార్యాలయం వైపునకు సదరు సీఐ రాలేదని సమాచారం. అప్పటివరకు పక్క స్టేషన్ ఎక్సైజ్ సీఐకు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో తిరిగి తానే ఇక్కడకు వస్తానంటూ చెబుతున్నారని.. చినబాబు సిఫార్సుతో మరోసారి ఇక్కడే రాజ్యమేలుతానని కూడా పరోక్షంగా బెదిరింపులకు దిగుతున్నట్టు తెలుస్తోంది. తద్వారా తనకు అప్పులిచ్చిన వారు తిరిగి అడగకుండా ముందరి కాళ్లకు బంధాలు వేస్తున్నట్టు ఎక్సైజ్ శాఖలో ప్రచారం జరుగుతోంది.

పోస్టింగుపైనా రచ్చ రచ్చే..!

వాస్తవానికి సదరు సీఐ పోస్టింగు వ్యవహారంలోనూ ఎక్సైజ్‌శాఖలో మొదట రచ్చ రచ్చ నడిచింది. మొదటగా మహారాణిపేట సీఐగా పోస్టింగు కోసం ఆయన ప్రయత్నించారు. అయితే, ఆయనపై అనేక ఆరోపణలు ఉన్నాయనే పోస్టింగు ఇచ్చేందుకు వెలగపూడి ఒప్పుకోలేదని అప్పట్లో ప్రచారం జరిగింది. అంతేకాకుండా విశాఖలో ఎక్కడా పోస్టింగు ఇచ్చేందుకు ఆయన అంగీకరించకపోవడంతో పాటు ఇతర ఎమ్మెల్యేలకు కూడా సూచించినట్టు వార్తలు గుప్పుమన్నాయి. అయితే తనకున్న పలుకుబడితో నేరుగా చినబాబు ద్వారా సిఫారసు చేయించుకుని శివారు ప్రాంతంలో పోస్టింగును ఆయన దక్కించుకోవడం గమనార్హం. కీలకమైన ఆ స్టేషన్‌లో అప్పటికే ఓ సీఐను నియమించగా ఆయన్ని తప్పించి మరీ ఈయన పోస్టింగ్ పొందాడు. సీనియర్ ఎమ్మెల్యే కూడా పై నుంచి వచ్చిన ఆదేశాలతోనే ఆయన పోస్టింగ్‌కు తలూపినట్టు ప్రచారం జరిగింది. నిజానికి ఆయనపై తీవ్ర అవినీతి ఆరోపణలున్నాయి. దొంగచలానాల కేసులో ఆయన కేసులను ఎదుర్కోవడంతో పాటు జైలుకు కూడా వెళ్లొచ్చారు. గతంలో నడిచిన ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వసూలైన మొత్తంలో వాడుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అటువంటి అధికారిని మొదటగా ఇక్కడ నియమించేందుకు పోస్టింగు వ్యవహారాలన్నీ చూసిన వెలగపూడి ఒప్పుకోలేదు. అయినప్పటికీ పైన తనకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి సీనియర్ ఎమ్మెల్యేపై ఒత్తిడి తెచ్చి మరీ పోస్టింగును దక్కించుకున్నట్టు తెలుస్తోంది.



అందరి వద్దా అప్పులే...!

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎత్తివేసింది. ఈ స్థానంలో ప్రైవేటు దుకాణాలకు తెరలేపింది. దీంతో ఈయన వసూళ్లకు మంచి అవకాశం లభించింది. తన పరిధిలో ఏర్పాటైన ప్రతీ ప్రైవేటు మద్యం దుకాణం యజమాని నుంచి ఆయన అప్పులు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ ఎవరైనా అప్పులు ఇచ్చేందుకు నిరాకరిస్తే... ఏదో ఒక సాకుతో ఇబ్బందులకు గురిచేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇలా ప్రైవేటు మద్యం దుకాణదారుల నుంచి లక్షల్లో అప్పులు తీసుకున్నారు. అంతేకాకుండా బార్ల యజమానుల నుంచి కూడా అప్పులకు తెగబడినట్టు తెలుస్తోంది. మొత్తంగా రూ.లక్షల్లో తీసుకున్న అప్పులను ఆయన ఎవరికీ తిరిగి చెల్లించలేదని సమాచారం. వీరందరూ కాస్తా ఉన్నతాధికారులకు సిఫారసు చేయడంతో సెలవులో వెళ్లిపోవాలంటూ ఆదేశించారు. అయితే, తాను సెలవులో మాత్రమే వెళుతున్నానని, తిరిగి ఇక్కడకే వస్తానంటూ పరోక్షంగా బెదిరింపులకు దిగుతూ.. అప్పులిచ్చిన వారు తిరిగి అడగకుండా జాగ్రత్త పడుతున్నారు. అంతేకాకుండా నేరుగా చినబాబు పేరు కూడా చెబుతుండటంతో ఎవరూ నోరెత్తడం లేదని సమాచారం.



జ్ఞానాపురం చావులమదుం వద్ద...

ముంచెత్తిన వాన

- నగరంలో కుండపోత వర్షం
- రోడ్లన్నీ జలమయం
- ఎక్కడికక్కడ స్తంభించిన ట్రాఫిక్

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు పడుతున్నా.. నగరం వైపు మాత్రం వరుణుడు కన్నెత్తి చూడలేదు. విశాఖ చుట్టుపక్కలా వర్షాలు పడుతున్నా.. నగరంలో మాత్రం భారీ వర్షమే కరువైంది. ఎట్టకేలకు విశాఖవాసుల వర్షపు దాహాన్ని వరుణ దేవుడు తీర్చాడు. విశాఖకు సమీపంలో ఉన్న రుతుపవన ద్రోణి, ఉత్తరాంధ్ర మీదుగా కొనసాగుతున్న అల్పపీడన ప్రభావంతో శనివారం రాత్రి ఒక్కసారిగా కురిసిన కుండపోత వర్షం.. మహా నగరాన్ని ముంచెత్తింది. గెడ్డలు పొంగిపొర్లాయి. రహదారులు జలమయమైపోయాయి. లోతట్టుప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్థంగా మారడం, డ్రైన్లు శుభ్రం చెయ్యకపోవడంతో కాలువల్లో పూడిక పేరుకుపోయింది. దీంతో వరద నీరు పారే అవకాశం లేక.. నగరం జలమయమైంది. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో.. వాహనాలు కదిలే వీలు లేక ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోయింది.



సంగం ఆఫీస్- దొండపర్తి రోడ్డులో...



వన్‌టౌన్ రామకృష్ణ జంక్షన్‌లో..



లక్ష్మయ్యపాలెంలో కురుస్తున్న వర్షం

ప్రాంతం	కురిసిన వర్షం (మి.మీ.ల్లో)
సీతమ్మధార	53.25
పెందుర్తి	45.0
పద్మనాభం	42.75
వేపగుంట	42.25
సుజాతనగర్	41.25
గురుద్వార	39.75
భీమిలి	38.0
గోపాలపట్నం	28.0
మహారాణిపేట	22.0
ఆనందపురం	20.5
ముడసర్లోవ	16.5
సింహాచలం	15.0
సాగర్‌నగర్	14.0
ఎన్‌ఏడీ జంక్షన్	14.0
పరదేశిపాలెం	13.75

విపత్తు నిర్వహణలో అప్రమత్తత అవసరం

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: భారీ వర్షాలు, వరదలు వంటి సహజ విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జీవీఎంసీలోని అన్ని విభాగాలు సిద్ధంగా ఉండాలని కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. భారత వాతావరణ శాఖ సమాచారం ప్రకారం రాష్ట్రంలో మూడు రోజుల పాటు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. నగరంలో భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున.. ఇప్పటికే అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొండవాలు, లోతట్టు ప్రాంతాలు, మురికివాడల్లోని ప్రజల ఆశ్రయానికి సామాజిక భవనాలు, పాఠశాల భవనాలను సిద్ధం చేశామన్నారు. కాలువలు, మ్యాన్‌హోల్స్, అధికంగా నీరు నిలిచే ప్రదేశాలను గుర్తించి.. నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా, నీటి కాలుష్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న వీధి దీపాలను వెంటనే మరమ్మతులు చేయడం, కూలిన, విరిగిపడిన చెట్లను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్ పేర్కొన్నారు. అలాగే జీవీఎంసీ వాహనాలు, జనరేటర్లు, చెట్లు తొలగించే యంత్రాలు, పొక్లెయిన్లు, ట్రక్కులకు ఇంధనం, రేడియో హ్యాండ్‌సెట్ వంటి అవసరమైన పరికరాలను సిద్ధం చేయాలని సూచించారు. ఇళ్లలో విద్యుత్ పరికరాలను జాగ్రత్తగా వాడాలని, పిల్లలను నీరు నిలిచిన ప్రదేశాల్లో ఆడకుండా చూడాలని, వర్షపు నీటిలో ప్రయాణాలు మానుకోవాలని కోరారు. చెట్లు, హోర్డింగ్‌లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, శిథిలావస్థకు చేరిన భవనాల వద్ద ప్రజలు ఉండరాదని హెచ్చరించారు.

22న సింహాచలంలో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సింహాచలం: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈ నెల 22న సింహాచలం కొండపై ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మూడు బ్యాచ్‌లలో ఈ వ్రతాలు జరుగుతాయి. ఇందులో పాల్గొనదలిచిన మహిళలు తమ ఆధార్ కార్డు నంబర్లతో సింహాచలం కొండపై ఉన్న పీఆర్‌ఓ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో సూచించారు. వ్రతం రోజున కూడా ఆధార్ కార్డును వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

కేజీహెచ్‌లో గుండె శస్త్రచికిత్సలు పునఃప్రారంభం

- సాక్షి కథనాలతో ప్రభుత్వంలో కదలిక
- ఏడు నెలల తర్వాత తొలి సర్జరీ

సాక్షి ఎఫెక్ట్..

డాబాగార్డెన్స్: ఎట్టకేలకు పేదోడి గుండెకు భరోసా లభించింది. ఉత్తరాంధ్రలోనే పెద్దాస్పత్రిగా పేరుపొందిన కేజీహెచ్‌లో గుండె శస్త్ర చికిత్సలు పునః ప్రారంభమయ్యాయి. 'సాక్షి' వరుస కథనాలతో కూటమి ప్రభుత్వంలో కదలిక వచ్చింది. కార్డియో విభాగంలో పరికరాలు మూలకు చేరి ఏడు నెలలుగా గుండె సంబంధిత సర్జరీలు నిలిచిపోయాయి. దీనిపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది.

కేజీహెచ్‌పై కూటమి నిర్లక్ష్యం

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదల ఆరోగ్య భద్రతకు నాడు–నేడు కార్యక్రమం ద్వారా ఆస్పత్రులను అభివృద్ధి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పేద వాడి వైద్యాన్ని గాలికి వదిలేసింది. ఒకవైపు మందుల కొరత వెంటాడుతోంది. గతంలో నెల రోజులకు సరిపడా మందులు ఒకేసారి అందించారు. కానీ ఇపుడు వారం, పది రోజులకు మాత్రమే ఇస్తున్నారు. ప్రధానంగా కీలకమైన కార్డియాలజీ విభాగంగా అధునాతన పరికరాలు మూలకు చేరాయి. వీటిని మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. దీంతో గత ఏడు నెలలుగా గుండె సంబంధిత సర్జరీలు నిలిచిపోయాయి.

సాక్షి వరుస కథనాలతో..

కేజీహెచ్‌లో ఏడు నెలలుగా గుండె శస్త్ర చికిత్సలు నిలిచిపోవడంతో 'సాక్షి' పత్రిక వరుస కథనాలను ప్రచురించింది. ఇదే సమయంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కేజీహెచ్‌కు సాయం చేయాలని కోరుతూ బిక్షాటన చేశారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. దీంతో ప్రభుత్వం కదలిక మొదలైంది.



వృద్ధుడికి ఓపెన్ హార్ట్ సర్జరీ విజయవంతం కావడంతో ఆనందం వ్యక్తం వైద్య బృందం



పేదోడి గుండెకోత

పేదోడి గుండెకోత పేరిట సాక్షి ప్రచురించిన కథనం

ఏడు నెలల తర్వాత సర్జరీ..

ఏడు నెలల తర్వాత కేజీహెచ్ కార్డియాలజీ విభాగంలో చేపట్టిన సర్జరీ విజయవంతమైంది. శనివారం బోడపాటి మావుళ్లు (70)కు అధునాతన హార్ట్–లంగ్ మెషిన్, టెంపరేచర్ కంట్రోల్ మెషిన్ సహాయంతో ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. ఈ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ మనిత, డాక్టర్ సతీష్, స్టాఫ్ నర్స్ భవాని, ఇతర పారా మెడికల్ సిబ్బందిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, సీఎస్‌ఆర్‌ఎంవో అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ యు.శ్రీహరి, అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ అభినందించారు. ఇకపై ఈ అధునాతన మెషిన్ ద్వారా గుండె శస్త్ర చికిత్సలు నిరంతరాయంగా కొనసాగుతాయని సూపరింటెండెంట్ తెలిపారు.

అసలు దోషి ఎవరు?

- వసూలు చేసింది రూ.2 లక్షలు
- ఎస్‌ఐ వద్ద పట్టుకుంది రూ.50 వేలే...
- రూ.లక్షన్నర ఎవరు జేబులోకి వెళ్లింది?
- విచారణ చేస్తున్న ఏసీబీ



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అవినీతి కథలో అసలు దొంగలు తప్పించుకున్నారా? మొత్తంగా వసూలు చేసిన రెండు లక్షల్లో పట్టుకుంది రూ.50 వేలేనా..? మిగిలిన రూ.లక్షన్నర అప్పటికే వేరే వాళ్ల జేబులోకి వెళ్లిపోయిందా? అయితే ఎవరి జేబులోకి వెళ్లిందనే కోణంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు విచారణ చేస్తున్నట్టు తెలుస్తోంది. తెలివిగా ఎస్‌ఐను ఇరికించి తప్పించుకున్న అసలు దోషిని తేల్చే పనిలో ఏసీబీ అధికారులు పడినట్టు సమాచారం. వాస్తవానికి అనకాపల్లిలో ఒక కేసు విషయంలో రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఎస్‌ఐ దాసరి ఈశ్వరరావును ఈ నెల 14వ తేదీన ఎస్‌ఐను ఏసీబీ అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో అసలు దోషి మాత్రం తెలివిగా దొరకకుండా తప్పించుకున్నట్టు ఏసీబీ అధికారులు అనుమానిస్తున్నారు. మొత్తంగా సదరు బాధితుడి నుంచి రూ. 2 లక్షల మేర వసూలు చేసినట్టు విచారణలో తేలినట్టు సమాచారం. అంతకు ముందు నేరుగా స్టేషన్‌లోనే రూ.లక్షన్నర తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ రూ.లక్షన్నర ఎవరు తీసుకున్నారు? ఎవరికి అప్పగించారు అనే కోణంలో లోతుగా ఏసీబీ అధికారులు విచారణ చేపట్టినట్టు సమాచారం.

'విజయ'వంతంగా చక్రం తిప్పిందెవరు...?

వాస్తవానికి గత ఏడేనిమిదేళ్లుగా అనకాపల్లి ప్రాంతంలోనే ఎస్‌ఐ ఈశ్వరరావు విధులు నిర్వర్తిస్తున్నారు. కశింకోట, అనకాపల్లి రూరల్, సీసీఎస్ తదితర పోస్టింగులు నిర్వర్తించారు. గత ఏడాది కాలంగా అనకాపల్లి టౌన్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్నారు. ఆయనపై గతంలో ఎన్నడూ ఈ తరహా భారీ అవినీతి ఆరోపణలు లేవనే పేరు డిపార్టుమెంటులో ఉంది. ప్రధానంగా టౌన్ స్టేషన్‌కు వచ్చిన తర్వాత ఈ వసూళ్ల ఆరోపణలు మొదలైనట్టు తెలుస్తోంది. అన్ని వ్యవహారాల్లోనూ సదరు ఎస్‌ఐ ఈశ్వరరావును ముందుపెట్టి వసూళ్లకు దింపి.. 'విజయ'వంతంగా వ్యవహారం నడిపింది ఎవరనేది తేలాల్సి ఉంది. ఏసీబీ అధికారులు కూడా ఈ కోణంలో ఇప్పటికే విచారణ చేస్తున్నట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఇవేకాకుండా పలు వ్యవహారాల్లో కూడా ఎస్‌ఐ ద్వారా నడిపించిన వసూళ్ల కథలో అసలు సూత్రధారి కోసం అన్వేషణ కొనసాగుతున్నట్టు తెలుస్తోంది. రూ.50 వేలు తీసుకుంటూ దొరికిన ఎస్‌ఐ నుంచి ఈ సమాచారం రాబట్టేందుకు ఏసీబీ అధికారులు ప్రయత్నించినట్టు కూడా ప్రచారం గుప్పుమంటోంది. అంతేకాకుండా సదరు బాధితుడు కూడా గతంలో తాను రూ.లక్షన్నర ముట్టచెప్పినట్టు కూడా ముందుగానే ఏసీబీ అధికారులకు సమాచారం అందించారని కూడా పోలీసు శాఖలో ఇప్పటికే చర్చ జరుగుతోంది. ఈ కోణంలో విచారణ జరిపి అసలు దోషిని పట్టుకునేందుకు చేస్తున్న ప్రయత్నం ముందుకెళ్లకుండా అడ్డుతగులుతున్నారని కూడా పోలీసుశాఖలో వార్తలు గుప్పుమంటున్నాయి.

ఎస్‌ఐను పావుగా వాడుకుంటూ..!

వాస్తవానికి సదరు స్టేషన్‌లో అసలు వ్యవహారాలు నడిపిస్తున్న వ్యక్తి కాస్తా ఎస్‌ఐను పావుగా వాడుకుంటున్నట్టు సమాచారం. ప్రిన్సిపల్ ఎస్‌ఐవి నువ్వేనంటూ వసూళ్లకు దింపినట్టు తెలుస్తోంది. గతంలో ఇదే ప్రాంతంలో పనిచేసిన సమయంలో ఒక భూమి వ్యవహారంలో తలదూర్చడంతో ఫిర్యాదులు ఎదుర్కొన్న సదరు వ్యక్తినే ఈ లంచాల అవతారంలో కూడా కీలక సూత్రధారిగా ఇప్పటికే ఏసీబీ అధికారులు గుర్తించినట్టు సమాచారం. అంతేకాకుండా స్థానికంగా అక్రమ మైనింగ్ వ్యవహారంలో కూడా నెలవారీగా భారీగానే వసూళ్లకు దిగినట్టు తెలుస్తోంది. గతంలో పలు ఆరోపణలతో పోస్టింగుకు దూరంగా ఉన్న సదరు వ్యక్తి.. ప్రస్తుతం రెచ్చిపోతున్నట్టు సమాచారం. అందినకాడికి ప్రతీ ఒక్క వ్యవహారంలోనూ మాముళ్లకు తెగబడినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, అత్యంత తెలివిగా నేరుగా రంగంలోకి దిగకుండా ఎవరినో ఒకరిని ముందుకుపెట్టి కథ నడిపిస్తూ.. విజయవంతంగా ముందుకెళుతున్నారనే పేరు ఉంది. ఈ వ్యవహారంలో అదృశ్య శక్తులు ఇప్పటికే అడ్డుతగులుతున్న నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఏ విధంగా ముందుకెళతారో? చూడాల్సి ఉంది.

స్టీల్‌ప్లాంట్ థర్మల్ పవర్ ప్లాంట్ పనులకు ఈవోఐ విడుదల

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆసక్తి వ్యక్తీకరణ జాబితాలోకి మరో విభాగం చేరింది. శనివారం విడుదల చేసిన నోటీసులో స్టీల్‌ప్లాంట్ థర్మల్ పవర్ ప్లాంట్ (టీపీపీ)–1కు సంబంధించి యాజమాన్యం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) జారీ చేసింది. 'కాంప్రహెన్సివ్ టెక్నికల్ మేనేజ్ మెంట్ అండ్ మెయింటెనెన్స్ ఆఫ్ కేప్టివ్ పవర్ ప్లాంట్–1 అండ్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ థర్మల్ పవర్ ప్లాంట్' పనులకు సంబంధించి ఈవోఐ దాఖలుకు సెప్టెంబర్ 9న ఆఖరు తేదీగా నిర్ణయించారు. అదే రోజు సాయంత్రం బిడ్లు తెరవనున్నట్టు నోటీసులో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వైజాగ్ స్టీల్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో నియామకం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శిగా కొటాన రాము(పెందుర్తి)ను, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శిగా బొబ్బిలి లక్ష్మణ్(పాడేరు)ను నియమించారు. ఈ మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

'దేవుడా.. ఈ రోజు ప్రాణాలతో ఉంచు!'

- రివర్ రాఫ్టింగ్‌లో ప్రతిరోజూ నేను కోరుకున్నది ఇదే..
- 'సాక్షి'తో ఆర్మీ వైద్యాధికారి వాసుపల్లి కవిత



8లో

'దేవుడా.. ఈ రోజు ప్రాణాలతో ఉంచు!'

- రివర్ రాఫ్టింగ్‌లో ప్రతిరోజూ నేను కోరుకున్నది ఇదే..
- ఎన్ని ఆటంకాలు ఎదురైనా ప్రయాణం ఆపలేదు
- 28 రోజుల్లో 1040 కి.మీ. రివర్ రాఫ్టింగ్ పూర్తి చేశాం
- 12 మంది బృందంలో నేనొక్కదాన్నే మహిళను..
- 'సాక్షి'తో ఆర్మీ వైద్యాధికారి వాసుపల్లి కవిత

SUNDAY SPECIAL


బ్రహ్మపుత్ర నది ఒడ్డున సేదతీరుతున్న కవిత

సాక్షి, విశాఖపట్నం: 'బ్రహ్మపుత్ర నదిలో రాఫ్టింగ్ మొదలుపెట్టిన రెండు గంటల్లోనే ప్రవాహం పెరిగింది. పెద్ద అలలా నీరు రావడం, అదే సమయంలో రాళ్లు ఎక్కువగా ఉండటంతో రాఫ్ట్ అదుపు తప్పి కిందపడిపోయాను. బ్రహ్మపుత్ర ప్రయాణమే ఆఖరుదని అనుకున్నాను. ఆ క్షణంలో దేవుడ్ని, దేశాన్ని ప్రార్థించుకున్నాను. కష్టమ్మీద మళ్లీ రాఫ్ట్‌లోకి ఎక్కాను. ఇక అక్కడి నుంచి వెనుదిరగలేదు. ప్రపంచ రికార్డు సాధించే దిశగా సాగిన మా ప్రయాణం విజయవంతమైంది. బ్రహ్మపుత్రలో రివర్ రాఫ్టింగ్ చేసిన తొలి మహిళగా గుర్తింపు పొందాను'అని వెల్లడించారు ఆర్మీ మేజర్, వైద్యాధికారి వాసుపల్లి కవిత. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరుకు చెందిన మేజర్ కవిత.. ఈ ఘనత సాధించిన తొలి మహిళగా ప్రపంచ రికార్డు నెలకొల్పారు. విశాఖలోని తూర్పు నౌకాదళానికి ఇటీవల వచ్చిన ఆమె తన అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

దేవుడికి, దేశానికి ప్రార్థించి..

1,040 కిలోమీటర్ల బ్రహ్మపుత్ర నదిని 28 రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇండో–టిబెటన్ బోర్డర్ నుంచి బంగ్లాదేశ్ సరిహద్దు వరకు మా ప్రయాణం సాగింది. ప్రతిరోజూ ఉదయం అల్పాహారం చేసి, దేవుడికి, దేశానికి ప్రార్థించి మా ప్రయాణం మొదలుపెట్టేవాళ్లం. 28 రోజుల్లో పూర్తి చేయాలంటే సమయం వృథా చేయకూడదు. అందుకే ఆహారం కూడా మితంగా, బోట్‌లోనే తీసుకునేవాళ్లం. ఒక్కోసారి 12 గంటలపాటు ఏకధాటిగా రాఫ్టింగ్ చేశాం. అనుకున్నది సాధించాం.

సాహస క్రీడలకు స్వర్గధామం

'అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో భారత్ వెనుకబడి ఉంది.. మన దేశంలో వీటికి ప్రాధాన్యం లేదు'అని చాలా మంది అంటారు. మేం దానిపైనే దృష్టి సారించాం. ఈ రాఫ్టింగ్‌తో ఒక మెట్టు ఎక్కాం. ఇకపై బ్రహ్మపుత్ర రివర్ రాఫ్టింగ్ పేరు చెబితే మొదట మా పేరే వినిపిస్తుంది. ఈశాన్య, ఉత్తరాది రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక పర్యాటకానికి ఉన్న ప్రాధాన్యం సాహస పర్యాటకానికి లేదు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, జీవ వైవిధ్యంతో కూడిన సాహస పర్యాటకానికి ప్రపంచ గుర్తింపు తీసుకురావాలన్నదే మా ప్రయత్నం.

మహిళలు ఎందులోనూ తక్కువ కాదు!

వైద్యులకు మానసిక స్థైర్యం ఉంటుంది కానీ, శారీరకంగా దృఢంగా ఉండరని చాలా మంది అంటుంటారు. అది తప్పని నిరూపించాలని ఎప్పుడూ అనుకునేదాన్ని. చిన్నప్పటి నుంచి నా ఆలోచనలు ఇలాగే ఉండేవి. పాఠశాల రోజుల్లో క్రీడలపై ఎక్కువ దృష్టి పెట్టాను. మగవాళ్లతో పోలిస్తే మహిళలు ఎందులోనూ తక్కువ కాదని చెప్పాలన్నదే నా ఉద్దేశం. ఇప్పుడు దాన్ని నిరూపించాను.

రాష్ట్రపతి మెడల్‌తో ఆత్మవిశ్వాసం

అరుణాచల్‌ప్రదేశ్‌లో పని చేస్తున్నప్పుడు 18 వేల అడుగుల ఎత్తులో ఉన్న గోరీచెన్ బేస్ క్యాంప్‌కు మెడికల్ ఆఫీసర్‌గా నాలుగైదుసార్లు వెళ్లాను. నన్ను గమనించిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ డైరెక్టర్.. 'మీరు కూడా ట్రెక్ చేయవచ్చు కదా'అని సలహా ఇచ్చారు. అప్పుడే రాఫ్టింగ్ కోర్సులో చేరాను. ఆ సమయంలోనే నేనెందుకు గోరీ చెన్ పర్వతాన్ని అధిరోహించకూడదు? అనిపించింది. నా మీద నాకు నమ్మకం వచ్చాక పర్వతారోహణకు సిద్ధమయ్యాను. ఒక రోజు ట్రెక్‌లో చాలా మంది ఉన్నారు. పైకి వెళ్తున్నప్పుడు పైనుంచి ఒక పెద్ద రాయి దొర్లుకుంటూ వచ్చింది. వెంట్రుకవాసిలో తప్పించుకున్నాను. విజయవంతంగా శిఖరాన్ని చేరి దేశ పతాకాన్ని ఎగురవేశాను. అదే సమయంలో ట్రెక్ చేస్తున్న ఓ మహిళ ఊపిరాడక ఇబ్బంది పడుతోంది. వెంటనే స్పందించి ఆమె ప్రాణాలు కాపాడాను. ఎంబీబీఎస్ చేసినందుకు ఆ రోజు ఎంతో ఆనందం కలిగింది. ఈ సంఘటనకు గానూ రాష్ట్రపతి నుంచి విశిష్ట సేవా పతకం అందుకున్నాను.

నాన్న భరోసా.. అమ్మ ఆత్మవిశ్వాసం!

నాన్న రామారావు రైల్వే క్లర్క్. అమ్మ గృహిణి. నాకు ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చినా, నా చదువు పూర్తి చేయడానికి నాన్న ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డారు. ఎంబీబీఎస్ అయ్యాక పీజీ చేస్తానని చెప్పాను. అప్పుడు నాన్న ఆర్థిక పరిస్థితిని వివరించారు. వైద్య వృత్తిలో స్థిరపడాలనుకుంటున్న సమయంలో, ఆర్మీలో కూడా మెడికల్ ఆఫీసర్‌గా పనిచేయవచ్చని తెలుసుకున్నాను. ఈ విషయం అమ్మానాన్నలకు చెప్పగా.. రక్షణ రంగం అనగానే వాళ్లు కొంచెం భయపడ్డారు. అక్కడ బాగుంటే కొనసాగుతాను, లేదంటే తిరిగి వచ్చి వైద్య వృత్తిలో స్థిరపడతానని వారికి నచ్చజెప్పాను. నాన్న భరోసా ఇచ్చారు. అమ్మ ఆత్మవిశ్వాసాన్ని నింపింది. అందుకే కెప్టెన్‌గా మొదలై.. మేజర్ స్థాయికి చేరుకున్నాను.


మేజర్ కవితకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రశంసలు(ఫైల్)

సుడిగుండంలో చిక్కుకున్నా..

మొదటి రోజు ప్రయాణం చాలా సవాలుగా అనిపించింది. రాక్ సర్ఫింగ్ సమయంలో రాఫ్ట్ బోల్తా పడి రాళ్ల మధ్య ఇరుక్కుపోయాను. సేఫ్టీ కయాక్‌ను పట్టుకొని 200 మీటర్ల వరకు ప్రయాణించాను. రెస్క్యూ సిబ్బంది సాయంతో అతి కష్టం మీద మళ్లీ రాఫ్ట్‌లోకి వచ్చాను. కొద్ది దూరం వెళ్లాక, మరోసారి టీమ్ మొత్తం 6 అడుగుల లోతైన నీటిలో పడిపోయాం. అక్కడ ఏర్పడిన సుడిగుండంలో నేను చిక్కుకున్నప్పుడు ఇక నా పని అయిపోయిందని అనుకున్నాను. 'ప్రతి నిమిషం నిన్ను నువ్వు రక్షించుకోవడానికి, నీ టీమ్‌ను నడిపించడానికి ఎలాంటి కష్టాన్నైనా ఎదుర్కో'అని అమ్మ చెప్పిన మాటలు గుర్తొచ్చి.. బలంగా ప్రయత్నించి బయటపడ్డాను. ఇలా వారం రోజుల పాటు ప్రయాణం నరకప్రాయంగా సాగింది. అయినా ఎక్కడా వెనకడుగు వేయలేదు. నిర్దేశించుకున్న 28 రోజుల్లో 1,040 కిలోమీటర్ల రివర్ రాఫ్టింగ్‌ను విజయవంతంగా పూర్తి చేశాం.


రివర్ రాఫ్టింగ్‌లో మేజర్ కవిత బృందం

రక్షణ రంగంలో నారీశక్తి



రక్షణ రంగంలో మహిళలు అద్భుతంగా రాణిస్తున్నారు. ఇక్కడ పనిలో పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. యూనిఫాం వేశాక స్త్రీ, పురుష భేదాలు ఉండవు. నారీశక్తికి ఇక్కడ ప్రాధాన్యం క్రమంగా పెరుగుతోంది. బ్రహ్మపుత్ర రివర్ రాఫ్టింగ్‌లో మొత్తం 12 మంది సభ్యులుండగా, అందులో నేను ఒక్కదాన్నే మహిళను. అయినా ఆ భేదం ఎక్కడా కనిపించలేదు. మేమంతా ఒకే బృందంగా అడుగు ముందుకు వేశాం.

ఎవరెస్ట్ ఎక్కుతా.. పీజీ చేస్తా!

ఈ ప్రపంచ రికార్డు నన్ను మరిన్ని సాహస యాత్రల వైపు నడిపిస్తోంది. సింధు ఉపనది జస్కర్ నదిలో రాఫ్టింగ్ చేయాలనుకుంటున్నాను. రాఫ్టింగ్ క్రీడకు పుట్టినిల్లు అయిన అమెరికాలోని అత్యంత ప్రమాదకరమైన కొలరాడో నదిలో రాఫ్టింగ్ చేయాలన్నది నా కోరిక. మకాలు పర్వతారోహణతో పాటు ప్రతిష్టాత్మకమైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడానికి కూడా అడుగులు వేస్తున్నాను. వైద్య వృత్తిలో భాగంగా స్పోర్ట్స్ మెడిసిన్ లేదా అప్తమాలజీలో పీజీ కూడా చేస్తాను.

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి

కలెక్టర్ ఎంఎస్ హరేంధిర ప్రసాద్


గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, బీసీ నాయకులు

డాబాగార్డెన్స్: భావితర పౌరులందరూ సర్దార్ గౌతు లచ్చన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని, దేశాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా.. శనివారం నగరంలోని జడ్జి కోర్టు సమీపంలోని ఆయన విగ్రహానికి పలువురు బీసీ నేతలు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 35 ఏళ్ల పాటు లచ్చన్న శాసనసభ్యుడిగా పనిచేసి, ఉత్తరాంధ్ర అభివృద్ధికి, ప్రజల కోసం పోరాడిన యోధుడని పేర్కొన్నారు. లచ్చన్న కుటుంబ సభ్యులు, యార్లగడ్డ వెంకన్న చౌదరి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, ప్రొఫెసర్ వివేకానందమూర్తి, కేశాని వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు గుత్తుల మధుసూదనరావు, బమ్మిడి రమణ, పితాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	:రూ.105
బ్రాయిలర్ (లైవ్)	:రూ.125
స్కిన్	:రూ.220
స్కిన్‌లెస్	:రూ.230

ఇల బృందావనం

- దివి నుంచి భువికి దిగివచ్చిన కృష్ణయ్య!
- అలరించిన బాలగోపాలం
- కనులపండువగా కృష్ణాష్టమి వేడుకలు





సీతంపేట/ఎంవీపీకాలనీ/తగరపువలస/ కొమ్మాది: నగరంలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం కనులపండువగా జరిగాయి. సంస్కారభారతి ఆధ్వర్యంలో ద్వారకానగర్ శ్రీకృష్ణ విద్యామందిర్ ప్రాంగణం గోకుల బృందావనాన్ని తలపించింది. 'బాలగోకులం' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ముద్దులొలికే చిన్ని కృష్ణులు, రాధలు, గోపికల వేషధారణలో సుమారు 170 మంది చిన్నారులు పాల్గొన్నారు. నెలల పసికందుల నుంచి ఎనిమిదేళ్ల బాలల వరకు.. బుడి బుడి అడుగులతో, చిలిపి నవ్వులతో నడిచొచ్చిన ఆ బాలగోపాలురను చూసి ఆహూతులు మురిసిపోయారు. బలరామ కృష్ణులుగా, రాధాకృష్ణులుగా చిన్నారులు చేసిన సందడితో ఆ ప్రాంగణమంతా నందనవనంగా మారింది. ఉట్టి కొట్టే ఉత్సవంలో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, శ్రీకృష్ణుని లీలలను స్మరణకు తెచ్చారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ విద్యా మందిర్ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన 'శ్రీకృష్ణుని లీలలు'ఘట్టాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణుని జననం నుంచి కంసవధ వరకు సాగిన ముఖ్య ఘట్టాలను(రోలుకు కట్టడం, కుబేర పుత్రుల శాప విమోచనం, ఇంద్రోత్సవం, గోవర్ధన గిరి ధారణ, కాళీయ మర్దనం, కంసవధ) కళ్లకు కట్టినట్లు ప్రదర్శించి, వాటి అంతరార్థాలను, ఆధ్యాత్మిక విశేషాలను సందర్శకులకు వివరించారు.


గోవర్ధన గిరి ధారణ ఘట్టంలో..


కాళీయ మర్దనం ఘట్టంలో..

మార్కెట్‌లోకి సోనీ బ్రావియా 98


సోనోవిజన్‌లో సోనీ బ్రావియా 98 అంగుళాల టీవీని విడుదల చేస్తున్న సోనోవిజన్ ప్రతినిధులు

విశాఖ సిటీ: జపాన్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సోనీ కంపెనీ నూతన ఆవిష్కరణ సోనీ బ్రావియా 98 అంగుళాల టీవీని డైమండ్ పార్క్ ప్రాంతంలోని సోనోవిజన్‌లో ఆవిష్కరించారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఈ అతి పెద్ద స్క్రీన్ టీవీ.. వీక్షకులకు పూర్తిగా లీనమయ్యే అనుభూతిని ఇస్తుందని సోనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సోనీ ఇండియా స్టేట్‌హెడ్ అయ్యప్పన్, డిప్యూటీ మేనేజర్లు రాజశేఖర్, భాస్కర్, సోనోవిజన్ ప్రతినిధి గోపాల్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో భారీ చోరీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని ఓ క్వార్టర్‌లో పట్టపగలు భారీ దొంగతనం జరిగింది. హెచ్‌ఆర్ అధికారి ఎస్. సుందరం కుటుంబం బయటకు వెళ్లిన గంటన్నరలోనే ఈ చోరీ జరిగినట్లు క్రైమ్ పోలీసులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో సుందరం దంపతులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటి ముందు తలుపు గడియ విరిగి ఉంది. లోపల బీరువా కూడా పగలగొట్టి ఉంది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న క్రైమ్ పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. దొంగలు బీరువాలో ఉన్న 24 తులాల బంగారు ఆభరణాలను తీసుకెళ్లగా, అదే బీరువాలో ఉన్న మరో 40 తులాల బంగారాన్ని వదిలేయడం పోలీసులను ఆశ్చర్యపరిచింది. క్లూస్ టీం ఘటనా స్థలం నుంచి ఆధారాలు సేకరించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.


వివరాలు సేకరిస్తున్న క్రైం పోలీసులు

సీసీ కెమెరాలపై ఏర్పాటు చేసుకోండి

చోరీల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నప్పటికీ, స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఎవరూ వాటిని ఏర్పాటు చేసుకోవడం లేదని పోలీసులు ఆవేదన వ్యక్తం చేశారు. దొంగతనం జరిగిన తర్వాత బాధపడటం కన్నా ముందు జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమని సీఐ శ్రీనివాసరావు అన్నారు.

చాపరాయికి పోటెత్తారు



చాపరాయి సందర్శనకు తరలివచ్చిన పర్యాటకులు

డుంబ్రిగుడ: వీకెండ్ కావడంతో సందర్శకులు పోటెత్తారు. చాపరాయి జలవిహారి సందర్శనకు శనివారం భారీగా తరలివచ్చారు. అయితే భారీ వర్షాలకు చాపరాయి గెడ్డ పొంగే అవకాశం ఉన్నందున కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు రెండు రోజులుగా సందర్శకులను నిర్వాహకులు అనుమతించలేదు. దీంతో వారంతా నిరాశకు గురయ్యారు. చాపరాయి జలవిహారి ప్రాంతంలో ప్రకృతి అందాలను తిలకిస్తూ ఫొటోలు దిగారు. ముఖద్వారం వద్ద స్థానిక థింసా కళాకారులతో కలిసి సందడి చేశారు. కొంత మంది పర్యాటకులు గిరిజన వస్త్రధారణలో ముస్తాబై ఫొటోలు తీసుకున్నారు.

రాయల్స్ విజయం

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్‌లో భాగంగా వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో అమరావతి రాయల్స్ ఏడు వికెట్ల తేడాతో సింహాద్రి వైజాగ్ లయన్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన లయన్స్ జట్టు తొమ్మిది వికెట్లకు 139 పరుగులే చేసింది. ఓపెనర్ అభిషేక్ ఒక పరుగుకే పెవిలియన్ చేరగా.. పవన్ కుమార్(30)తో మరో ఓపెనర్ హానీష్ వీరారెడ్డి కలిసి స్కోర్‌ను 51 పరుగులకు చేర్చారు. కెప్టెన్ రికీబుయ్ ఐదు పరుగులకే వెనుతిరగ్గా వీరారెడ్డి (41) 87 పరుగుల వద్ద ఔటయ్యాడు. సందీప్(10), దుర్గాకుమార్(14), అజయ్‌కుమార్(18) రెండంకెల స్కోర్లే చేయగలిగారు. సందీప్ మూడు వికెట్లు తీయగా హనుమ విహారి, అయ్యప్ప, సంతోష్ రెండేసి వికెట్లు పడగొట్టారు. ప్రతిగా రాయల్స్ జట్టు 15 ఓవర్లలోనే ఆటను ముగించేసింది. కెప్టెన్ హనుమ విహారి 62, ప్రసాద్ 21, ప్రణీత్ 44 పరుగులతో రాణించారు. విజయ్ రెండు, దుర్గాకుమార్ ఒక వికెట్ తీశారు.



వారియర్స్ గెలుపు

ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన మరో మ్యాచ్‌లో తుంగభద్ర వారియర్స్ విజయం సాధించింది. టాస్ ఓడి కాకినాడ కింగ్స్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. 4.3 ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయి 22 పరుగులు చేసిన స్థితిలో వరుణుడు రాకతో మ్యాచ్ ఆగింది. ఆటను ఏడు ఓవర్లకు కుదించగా తిరిగి ఇన్నింగ్స్ కొనసాగించిన కింగ్స్ ఏడు వికెట్లు కోల్పోయి 37 పరుగులే చేసింది. మనీష్ 14 పరుగులు చేయగలిగాడు. స్టీఫెన్, తోషిత్ రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా వారియర్స్ ఓపెనర్లు జ్ఞానేశ్వర్(15), ప్రశాంత్(25) వికెట్ కోల్పోకుండానే 13 బంతుల్లోనే విజయాన్నందించారు.

బస్సెక్కిన మహిళ.. బేజారైన ఆటోవాలా

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వచ్చిన వెంటనే ఆటోలకు షాక్ తగిలింది. మహిళలతో బస్సులు రద్దీగా మారగా.. ఆటోలు మాత్రం ప్రయాణికుల కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. శుక్రవారం వరకు ప్రయాణికులతో వరుస ట్రిప్పులు వేసిన ఆటో డ్రైవర్లు.. శనివారం మాత్రం బేరాలు లేక వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

